# 9. అజ్ఞాన విజ్ఞానం

ఈ ప్రపంచాన్నంతటిన్నీ అయ్యరుగారి మసాలా దోశలా మడతపెట్టి అందులో రష్యాని నాయుడుగారి చట్నీలా నంజుకుంటూ భోంచెయ్యాలని ప్లానులు వేసే రోజుల్లో హిట్లరుకు దేశదేశాల్లోనూ చూసి రమ్మంటే కాల్చి, బూడిదచేసి పట్టుకొచ్చే పంచమాంగదళా లుండేవి. వాటిని చూసుకొని హిట్లర్ పన్నెండు కోర్ల్సూ త్రిప్పించి దుంప దెంపుతాననే అగ్నిహోత్రావధాన్లులా పన్నెండు రోజులలో ప్రపంచాన్ని పాదాక్రాంతం చేసుకోగలనని మురిసిపోతుండేవాడు.

ఇలా ఉండగా ఆ జర్మన్ అగ్నిహోత్రావధాన్లకి ఓ అర్ధరాత్రివేళ గొప్ప అనుమానం తగిలింది. "విదేశాల్లో మన గూఢచారుల పప్పు బాగానే ఉడుకుతోంది. సరే! మరి స్వదేశంలో ఎలా ఉంది? ప్రజలంతా ప్రభుభక్తి పరాయణులై రాత్రింబవళ్ళూ హిట్లరాష్టకం పఠిస్తూ, సాంప్రదాయబద్ధులై ఉన్నారా ? లేదా ?" అని.

ఎంతైనా హిట్లర్ కార్యశూరుడు గదండీ! అందుకని తక్షణం ఓ డజన్ కార్డుముక్కల్ని జేబులో వేసుకుని, కాశీ మజిలీ కథల్లో ముసలి రాజులా మారువేషం వేసుకుని, రాజ

ధానిలో నాలుగు దిక్కులకూ వెళ్ళి ఆ కార్డులమీద ఏమేమో వ్రాసి రెండో కంటివాడికి తెలీకుండా వాటిని ఓ డజను కొంపల్లో పడేసివచ్చి సుష్టుగా ఓ పావు పందిని తిని అరబుడ్డీ సేవించి హాయిగా నిద్రపోయాట్ట.

తెల్లారే లేచి పళ్ళు తోముకోకుండానే ఓ పెగ్గు సేవించి, గూఢచారి శాఖాధ్యక్షుడికి కబురు చేద్దా మనుకుంటూండగా— సదరు పెద్ద మనిషే స్వయంగా విచ్చేసి ఓ డజన్ కార్డుల్ని హిట్లరు ముందుంచాడట. ఆ కార్డులమీద "హిట్లర్ జాత్యహంకారి, హిట్లర్ పిచ్చికుక్క, హిట్లర్ కు బుద్ధిలేదు, హిట్లర్ యుద్ధోన్మాది, హిట్లర్ నియంత, హిట్లర్ నశించాలి" అంటూ ఓ డజన్ రకాల నినాదాలు అందంగా వ్రాసి ఉన్నాయట.

ఏమీ తెలియనివానిలా హిట్లర్ ఆ కార్డులన్ని శ్రద్ధగా చదివి, మన రౌడీలకు రౌడీలు సిన్మాలో విలన్ లా కాసేపు చిందులు తొక్కి" మన రాజధానిలోనే ఇంత అరాచకమా? ఈ పని చేసిన దేశద్రోహి ఎవడో కనుక్కున్నావా? వాడిని పట్టుకొని నూనె గానుగలో వేయించావా? లేదా?" అని హూంకరించగా, ఆ గూఢచారి శాఖాధ్యక్షుడుగారు ఓ శాల్యూట్ కొట్టి అటెన్షన్లో నిలబడి "యస్, సర్, కనుక్కున్నాను! ఆ దేశద్రోహి ఎవరోగాదు తమరే!" అన్నాట్ట.

ఈసారి హిట్లర్ హోత్రావధాన్ల తెలివితేటలకు ఆశ్చ

ర్యపడ్డ రామప్పంతుల్లా ఫోజుపెట్టి 'శభాష్' కానీ, మనలో మాట శిష్యా! ఎలా కనుక్కోగలిగావు?" అని అడగ్గా......

"అదేమంత ఘనకార్యం గురూ. తమర్ని గురించిన నిజాల్ని ఇంత సూటిగా, నిష్కర్షగా, నిజాయితీగా చెప్పగల దమ్ములు మీకుగాక మరెవరికున్నాయి!" అని సెలవిచ్చాడట ఆ గూఢచారి శాఖాధ్యక్షుడు.

"ఆ తర్వాత అతగాడి గతేమయిందోగానీ, మొత్తం మీద గొప్పవాళ్ళ గొప్పదనాన్ని ఆ గొప్పవాళ్ళు మాత్రమే గిరీశంలా సూటిగా చెప్పుకోగలరనేది మాత్రం స్పష్టం. "పూనా డక్కన్ కాలేజీలో నేను లెక్చరులిచ్చే రోజులలో" అంటూ గిరీశం పదే పదే చెప్పుకోలేదా!

ఇలాంటితాజా హిట్లర్-కమ్-గిరీశం కథొకటి ఈమధ్య పత్రికల్లో పడింది. అయితే ఈ గిరీశం జర్మనీవాడు కాదు, కలియుగ వైకుంఠమైన హాలీవుడ్ నివాసి.

క్లియోపాత్రా ముక్కు ఇంకాస్త పొడుగ్గానో, లేక పొట్టిగానో ఉంటే ప్రపంచ చరిత్రే మరోలా వుండేదని ఆ రాణీ ప్రేమపురాణం, ఈ రాజా రాసక్రీడలూ మాత్రమే చరిత్ర అనుకునే మాడరన్ యూరోపియన్ శాస్త్రుర్లు కొందరు లావాటి హిస్టరీ తలగడాలు రాయగా మనం భక్తి ప్రపత్తులతో పారాయణం చేసి ఉన్నాం గదా! ఆ క్లియోపాత్రా పడకటింటి పురాణాన్ని హాలీవుడ్ కళాకారులు కళ్ళుచెది

రేలా, బుర్ర బెదిరేలా సిన్మాగా తీశారు. అందులో హీరోయిన్‌గా వేసిన ఎలిజబెత్ టేలర్‌కు భూనభోంతరాళాలూ అదిరిపోయేలా పబ్లిసిటీ యిచ్చి, బ్రహ్మరథం పట్టారు. హాలీవుడ్ సినీ బేహార్లు మన మార్వాడీల్లా అర్ధడాక్కులు కారు. వాళ్ళది చాలా నాజూకైన హైక్లాస్ బిజినెస్. ఎలాంటి ప్రేక్షక చేపలకూ, ఎలాంటి విమర్శక సొరచేపలకూ ఎలాంటి పబ్లిసిటీ గాలాలు వేయాలో వాళ్ళకు బాగా తెలుసు. ఇత్తడిముక్కను తెచ్చి తమ పబ్లిసిటీ హంగామాతో దాన్ని బంగారం కన్నా రెట్టింపుధరకు అమ్మేయగల ఘనులు వాళ్ళు.

భట్రాజులూ, పంచరత్నాల కవులూ తెలుగు దేశంలోనేగాదు హాలీవుడ్‌లోనూ ఉన్నారు. పోతే ఇక్కడ బీడీ కట్టకో పంచరత్నం. చుట్టముక్కకో స్తోత్రం రాస్తే అక్కడ పెగ్గులకూ, సీసాలకూ, ఫోర్క్కుకూ ఆశపడి రాస్తారంతే. ఈ క్లియోపాత్రా ప్రొడ్యూసర్ గారు అలాంటి మహాకవుల్ని ఓ మందని పోగుచేసి తన సిన్మా హీరోయిన్ లిజ్ టేలరమ్మ గారి తలకాయ మీది విగ్గుదగ్గర్నుంచి కాలి గోళ్ళకు వేసిన రంగుదాకా గల అన్ని అయిటముల మీదా పంచరత్నాలు రాయించి. వాటిని పంచరంగుల్లో అచ్చుగుద్దించి ప్రపంచాన్ని ఊదరగొట్టి పారేసి, అంతటి మహానటి నటించిన తన మహత్తర చిత్రాన్ని చూడమని అప్పీలు చేసుకున్నాడు.

దాంతో ఆసిన్మా సంగతేమోగానీ ఈ టేలరమ్మగారు మాత్రం నిజంగానే మహానటిగా చెలామణీ అయిపోయి ఆవిడ సంపాదన అమెరికా వాడి అపోలో కన్నా ముందే చంద్రమండలం దాకా వెళ్ళి తిష్టవేసింది ఆసిన్మాలో హీరోగా

వేసిన రిచర్డ్ బర్టన్‌ను మళ్ళీ పెళ్ళాడటం, ఇద్దరూ కలిసి కోట్లకు పడగలెత్తి గోడవున్లు చాలక ఇబ్బంది పడటం. అన్నీ హిట్లర్ మెరుపు దాడిలా చకచకా జరిగిపోయాయి. అప్పట్నించీ వాళ్ళు తుమ్మినా దగ్గినా అదో గొప్ప న్యూస్ అయిపోయింది.

ఇదిలా ఉండగా ఈమధ్య ఆ టేలరమ్మ నలభయ్యోదో ఏభయ్యోదో పుట్టిన రోజు వస్తే ఆనాడు బర్టన్‌సాబ్ భూదేవంత అరుగూ, ఆకాశమంత షామియానా వేయించి ఘనమైన విందుచేసి. మన బీడీ భట్రాజుల చుట్టపీక కవుల సమక్షంలో జేగీయమానంగా వెలిగిపోయే ఓ వజ్రాల నెక్లెస్‌ను ప్రేమోపహారంగా లిజ్ టేలర్ మెళ్ళో వేసి ధన్యుడయాడట. దాని ఖరీదు నలభై కోట్లా? అరవై కోట్లా? అని ఎవరెంత ప్రశ్నించినా చెప్పలేదట.

సంగతేమంటే ఆ నెక్లెస్ ప్రస్తుతం ఆగ్రాలో తాజ్ మహాల్లో సుఖంగా పవ్వళించి ఉన్న ముంతాజ్‌మహాల్‌కు షాజహాన్ ప్రేమతో చేయించి పెట్టినదట. మన బర్టనుడు ప్రపంచంలోని వజ్రాల వ్యాపారుల్నందర్నీ గాలించి దాన్ని సంపాదించాడట. ఆహా! అమర ప్రేమ కదండీ ఆ హాలీవుడ్డు బాబుది.

ఆ విందులోనే సదరు ఆలీవుడ్డు బాబుగారు పెగ్గు కవుల పీపా భట్రాజుల సమక్షంలో మరో గొప్ప విషయాన్ని కూడా మన గిరీశం స్టైలులో బయటపెట్టాడు. ఏమంటే ఆయన గారసలు తన హృదయరాణికి పుట్టింరోజు కానుకగా

తాజ్‌మహల్‌నే కొనేసి బహూకరిద్దామనుకున్నాడట. దేశాన్నే తాకట్టు పెట్టగల ఘనులున్నచోట అదేమంత కష్టం కాదు గానీ, ఆ తాజ్‌మహల్ని అక్కడ్నించి ఊడబీకి ఆలీవుడ్డు దాకా మోసుకురాగల అభినవ హనుమంతుడు దొరక్క ఊరుకున్నాట్ట. ఆ విధంగా హిట్లర్‌కు స్టాలిన్‌గ్రాడ్‌లో జరిగినట్లుగా జ్ఞానోదయమై ఈ నెక్లెస్‌తో సరిపెట్టుకున్నాట్ట.

ఇది చదివి మీరు ఆశ్చర్యపడనక్కర్లేదు. ఆగ్రహం అంతకన్నా అనవసరం. 'డబ్బుంటే చాలా! కూటికి పేదలమైతే మాత్రం కులానికి-శీలానికికూడా పేదలమేనా? అని వాపోయే అభ్యుదయ కవుల కథల్లోని బీద హీరోయిన్లా ఫోజులు పెట్టకండి. అది మరీ ఓల్డు ఫ్యాషన్.

వెనకటికో హాలీవుడ్డు తార బొంబాయి వస్తే విమానాశ్రయంలో మన బీడీకవులూ. చుట్టపీకెల భత్రాజులూ గుంపులుగా ఎగబడ్డారట. ఆవిడను కాస్త ఆ కూలింగ్‌గ్లాసెస్ తీసేయమంటే "ఔరా" అంటూ హూంకరించింది గానీ తీయలేదట. ఆ సంగతి చెప్పుకొని ఏడ్చారు వీళ్ళంతా తమ పత్రికల్లో. అవును మరి! ఆవిడ ముఖంచూస్తే చాలు జన్మ తరించిపోతుందనుకునే బీడీ ముక్క మేధావులూ, భూతాల స్వర్గం అమెరికాలో అయిదురోజులు చదివినా మహా విజ్ఞానుల మయిపోతామనుకునే ఎమ్మే బడుద్ధాయిలూ, కలియుగ కాశీ అమెరికా దర్శిస్తే బొందితో కైలాసం పోవచ్చుననుకునే ఆధునిక సూటుదార్లూ ఉన్నప్పుడు మనం ఇలాంటివి చదివి ఏడ్చి లాభం లేదు.

యథా ప్రజా! తథా రాజా!

(ఏప్రిల్, 1972)